రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి కలెక్టరేట్, మే 20: సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి 28వరకు జరగనున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 28 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 14 వేల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ఉంటుందని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎక్కడా సమస్యాత్మక కేంద్రాలు లేవని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించామన్నారు. పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నందున విద్యార్థులు ముందస్తుగా తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలను ఒకరోజు ముందుగానే చూసుకోవాలన్నారు. ఆదివారం కూడా పరీక్ష ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరీక్షలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయనున్నారని, పరీక్షా కేంద్రాల దగ్గరలో ఉన్న జీరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

అందోల్, మే 20: జోగిపేట ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సదస్సు) నిర్వహించనున్నట్లు డీఈఈ శ్రీనివాస్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నాసాగర్ ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం వరకు సమావేశం ఉంటుందని తెలిపారు. సదస్సులో కరెంట్ సరఫరాలో అంతరాయం, విద్యుత్ మీటర్లు, బిల్లులు సమస్యలు, కొత్త కనెక్షన్లు ఇతరత్రా సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు సదస్సుకు హాజరై ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

పారిశుధ్య పనులు మెరుగుపర్చాలి

సిర్గాపూర్, మే 20: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని జడ్పీసీఈవో స్వప్న అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండలపరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో మల్సూర్‌నాయక్‌తో సమావేశమై వార్షిక రికార్డులు, క్యాషుబుక్ తనిఖీ చేసి సమీక్షించారు. వార్షిక అకౌంట్ రికార్డులపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ స్వచ్ఛతపై చర్యలు తీసుకోవాలని ఆమె ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రభాకర్, అకౌంటెంట్ మంజుల, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నారాయణఖేడ్, మే 20: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతన విధానం అమలు కావడం లేదన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఇచ్చే సామగ్రిని సైతం ఇవ్వడం లేదన్నారు. పెరిగిన జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచకపోవడంతో కార్మికులకు పనిభారం పెరిగి అనేక ఇబ్బందుల మధ్య విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికుల ఇబ్బందులను గుర్తించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు ఉన్నారు.

కరపత్రాలతో కార్మికుల నిరసన

జిన్నారం, మే 20: జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామిక వాడలోని టీఐడీసీ పరిశ్రమ ఎదుట కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నాయకుల పిలుపు మేరకు కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని కార్మికులు కరపత్రాలను ప్రదర్శిస్తూ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్ మృతి

హత్నూర, మే 20: మద్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన హత్నూర మండలం చందాపూర్ శివారులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. హత్నూర ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శివంపేట శివారులోని బీరు ఫ్యాక్టరీ నుంచి మద్యం లోడ్‌తో కరీంనగర్ వెళ్తుండగా చందాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి లారీ బోల్తాపడినట్లు తెలిపారు. ప్రమాదంలో లారీడ్రైవర్ ప్రవీణ్(23) అక్కడికక్కడే మృతి చెందగా క్లీనర్ మహమ్మద్ మంజుమీల్ ప్రమాదం నుంచి బయట పడినట్లు తెలిపారు. లారీడ్రైవర్ ప్రవీణ్ స్వస్థలం బీదర్ జిల్లా, ఔరాద్ తాలూకా, చింతకీ గ్రామంగా తెలిపాడు. మృతుడి తల్లి అనుషాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణం దగ్ధం

సిర్గాపూర్, మే 20: విద్యుదాఘాతంతో ఎరువుల దుకాణం దగ్ధమైన ఘటన మండలంలోని వాసర్‌లో జరిగింది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పవన్ రెడ్డి సోమవారం రాత్రి ఎరువుల దుకాణాన్ని మూసివేశారు. అర్ధరాత్రి వేళ షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకొని మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న యజమాని వెళ్లి చూడగా అప్పటికే దుకాణంలోని విలువైన వస్తువులు కాలిపోయాయి. దుకాణం లైసెన్స్, ఈ పాస్ మిషన్, లావాదేవీల రికార్డులు, పత్తి విత్తనాల ప్యాకెట్లు కాలి రూ. 4లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు పవన్‌రెడ్డి తెలిపారు. ఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నాగల్‌గిద్ద, మే 20: నకిలీ విత్తనాలు, మందులు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని నారాయణఖేడ్ వ్యవసాయ సంచాలకుడు నూతన్‌కుమార్ ఫర్టిలైజర్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని రైతువేదికలో ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిస్థితి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రవీణ్‌చారి, డీలర్లు పాల్గొన్నారు

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వరప్రసాద్

కోహీర్, మే 20: కోహీర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి హైదరాబాద్‌కు బదిలీ అయిన తహసీల్దార్ బాలశంకర్‌ను మంగళవారం తహసీల్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వరప్రసాద్, సిబ్బంది పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా నాయబ్ తహసీల్దార్ వరప్రసాద్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా నిమ్జ్ రోడ్డు

బీఆర్ఎస్ హయాంలోనే మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

హుగ్గేలి నుంచి బర్దీపూర్ వరకు 65 జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మించిన ప్రత్యేక మార్గం, నిమ్జ్ రోడ్డు మార్గంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

జహీరాబాద్, మే 20:నిమ్జ్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా నిర్మించిన రోడ్డు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్)లో పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆయా మండలాల్లోని 17 గ్రామాల్లో 12,635 ఎకరాల భూసేకరణ చేపట్టి, అందులో 2.50 లక్షల మందికి ప్రత్యేకంగా 5 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే మొదటి విడతలో ఆయా మండలాల్లో భూసేకరణ పూర్తికాగా, రెండో విడతతో భూ సేకరణ ముమ్మరంగా కొనసాగుతుంది. ఇప్పటికే సంబంధిత అధికారులు ఆయా మండలాల పరిధిలోని 7వేల ఎకరాలకుపైగానే భూసేకరణ పూర్తి చేశారు. నిమ్జ్ ప్రాంతానికి వచ్చే పారిశ్రమిక వేత్తలు, యాజమాన్యాలకు సరైన రహదారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో 2023 లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంది. ఈ నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు చేసే ఆయా పారిశ్రమిక వేత్తలు, ప్రతినిధులు. యజమానుల రాకపోకలతో పాటు పరిశ్రమల్లో తయారు చేసే వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. అందులోభాగంగానే నిమ్జ్ ప్రాంతాన్ని, హైదరాబాద్–ముంబయి జాతీయ రహదారి 65కు అనుసంధానం చేస్తూ జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి నుంచి ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ వరకు రూ.100 కోట్లతో 9.5 కిలోమీటర్ల ప్రత్యేక రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంది. ఆయా గ్రామాల మీదుగా రహదారి నిర్మాణానికి 65 ఎకరాల భూమి రైతుల నుంచి సేకరించి వారికి నష్టపరిహారం కింద రూ.7.50 కోట్లు చెల్లించింది. జహీరాబాద్, ఝరాసంగం ఆయా మండలాల పరిధిలోని హుగ్గేల్లి, ఝరాసంగం మండలంలోని మచ్నూర్, బర్దీపూర్, కృష్ణాపూర్ గ్రామాల్లో వంద అడుగుల వెడల్పుతో నిర్మించిన రెండు వరసల రహదారిపై 13 చోట్ల వంతెనలు నిర్మించారు. ఆయా గ్రామాల మధ్య నిర్మించిన రహదారికి మధ్యలో సుమారుగా 420 విద్యుత్ దీపాల స్తంభాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల కోసం 131కేవీ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా ప్రజల భద్రత కోసం వైట్, ఎల్లో లైన్స్, పాదచారుల కోసం క్రాసింగ్ జీబ్రా, వేగ పరిమిత, మలుపు గుర్తులను ఏర్పాటు చేశారు. రోడ్డు మధ్యలో డివైడర్లు, కంచెలు, సూచిక బోర్డులను సిద్ధం చేశారు. రోడ్డుకు ఇరువైపుల ఉన్న గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతుల కోసం ఇరువైపులా 100 మీటర్ల రోడ్డును ఏర్పాటు చేశారు. ఝరాసంగం మండలంలోని మచ్నూర్, బర్దీపూర్, కృష్ణాపూర్ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు వైపులా సూచిక బోర్డులను ఏర్పాటు చేసి ఇరువైపులా డివైడర్లను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టులో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఈనెల 23న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈపాస్‌తోనే ఎరువులు విక్రయించాలి

ఎరువుల డీలర్లకు ఈపాస్ యంత్రాలు అందజేస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్, మే 20: ఈ పాస్ యంత్రాలతోనే ఎరువులు విక్రయించాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి అన్నారు. మంగళవారం రంజోల్ రైతువేదికలో జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఎరువుల డీలర్లకు ఈపాస్ యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో రైతులు పంటల సాగు చేసేందుకు ఎరువుల అవసరం ఎంతో ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పక్కనే ఉన్న కర్ణాటక ప్రాంతానికి ఎరువులు తరలించే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడి నుంచి ఎరువులు తరలించకుండా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. డీలర్లు తప్పని సరిగా రైతుల ఆధార్‌కార్డు లింక్ చేసిన తర్వాతే ఎరువులను పంపిణీ చేయాలన్నారు. ఈపాస్ యంత్రాల ద్వారా ఏ రైతుకు ఎంత ఎరువు విక్రయించారనేదిఉన్నతాధికారులకు తెలుస్తుందన్నారు. డీలర్లు ఎప్పటికప్పుడు ఎరువుల విక్రయాలకు సంబంధించిన వివరాలను ఈ పాస్ యంత్రాల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో లావణ్య, అభినాశ్‌వర్మ, వినోద్‌కుమార్, హస్మోద్దీన్, ప్రసాద్, సుదర్శన్, ప్రదీప్‌కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

అందోల్, మే 20: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు జోగిపేట ఎస్సై పాండుగౌడ్ మంగళవారం తెలిపారు. నారాయణఖేడ్‌కు చెందిన రాకేశ్(27) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోవడంతో సంగుపేట సమీపంలోని అండర్‌పాస్ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి ముక్తబాయి ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నాసాగర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్సై పాండుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన దానంపల్లి రాములు(52) టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జోగిపేటకు వస్తుండగా అన్నాసాగర్ శివారులో ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన రాములు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ లింగయ్య అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని మృతుడి భార్య తుల్జమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిమ్జ్ భూ భాధితులకు, కూలీలకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్

ఝరాసంగం, మే 20: నిమ్జ్‌లో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం న్యాయమైన ధరతో పాటు నివాస స్థలం, కూలీలకు పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఎల్గోయిలో ముంగి, చిలేపల్లి తండా, ఎల్గోయి గ్రామాల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిమ్జ్ పరిసర ప్రాంతాల్లో భూములకు బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.40 నుంచి 60 లక్షల వరకు ధరలుండగా ప్రభుత్వం మాత్రం కేవలం రూ.15 లక్షల పరిహారం చెల్లించడం తీవ్ర అన్యాయమన్నారు. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా భూములు తీసుకోవాడం చట్టవ్యతిరేకమని, భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ విలువకు మూడింతల పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. లేదంటే రిజిస్ట్రేషన్ ధరల ప్రకారమే రైతులకు భూములు కొనివ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేస్తామన్న హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అదే చట్టాన్ని విస్మరించడం బాధాకరమని మండిపడ్డారు. ముచ్చర్ల ఫార్మాసిటీ, లఘుచర్లలో ఎకరానికి రూ.20 లక్షలు, 120 గజాల ప్లాటు ఇచ్చిన ప్రభుత్వం నిమ్జ్ పరిధిలో మాత్రం అవే నిబంధనలు పాటించకపోవడం న్యాయమేనా అని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం, కూలీలకు పునరావాసం అమలు చేసే వరకు రైతులు, కూలీలతో కలిసి పోరాడుతామన్నారు. సమావేశంలో చంద్రన్న, నర్సయ్య, ప్రభు, లక్ష్మణ్, శంకర్, గోపాల్, జేసీబీ రాజు, బాలప్ప, సిద్ధమ్మ, గంగమ్మ, అంజమ్మ, తుల్జమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టండి

అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సంగారెడ్డి, మే 20: బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పెండింగ్ పనులను పూర్తిచేయడంలో అధికార పార్టీ నిర్లక్ష్యం చేస్తుందని, అధికారులు చర్యలు తీసుకొని సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో పెండింగ్ పనులపై ఎమ్మెల్యే చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పనులు నిలిచి పోవడంతో పలుచోట్ల పిచ్చిమొక్కలతో నిండిపోతున్నాయని, వీలైంత త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సదాశివపేట మండలం సిద్దాపూర్, కందిలో అసంపూర్తిగా ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు కందికి రూ.5కోట్లు, సిద్దాపూర్‌కు రూ.4కోట్ల పనులకు బిల్లులు చెల్లిస్తే నెల రోజుల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు వినియోగంలోకి వస్తాయన్నారు. సంగారెడ్డి, సదాశివపేట, ఆరుట్ల, పెద్దాపూర్‌లలో సబ్‌స్టేషన్ల టెండర్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సదాశివపేట ఎంపీపీ భవన నిర్మాణానికి రూ.85లక్షల నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. మినీ హజ్‌హౌస్ నిర్మాణానికి రూ.2కోట్లు అదనంగా మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. సం గారెడ్డిలో డంపింగ్ యార్డ్ పనులు వేగవం తం చేసి అధునీకరించాలని నియోజకవర్గంలో పేరుకుపోయిన పెండింగ్ పనులను అధికారులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

పలుగుతండాలో గాలివాన బీభత్సం

పలుగుతండా, పోతన్‌పల్లిలో గాలులకు పడిపోయిన రేకులు విద్యుత్ స్తంభం

నారాయణఖేడ్, మే 20: మంగళవారం బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో నారాయణఖేడ్ మండలం పలుగుతండాలో తీవ్ర నష్టం వాటిల్లింది. తండాలోని పలు రేకుల షెడ్లు ధ్వంసం కాగా పలు ఇండ్లపై ఉన్న పైకప్పులు ఎగిరిపోయాయి. చెట్లు కూలి ఇండ్లపై పడడంతో ఇండ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పలుగుతండా, పోతన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు తోడు భారీ వర్షం కురవడంతో ఇండ్లల్లోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ తండాను సందర్శించి ఆయా కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం అధికారులకు సమాచారం అందించడంతో ఆర్ఐ మాధవరెడ్డితోపాటు ట్రాన్స్‌కో అధికారులు తండాలో పరిస్థితిని సమీక్షించారు.

పిడుగుపాటుకు బర్రె మృతి

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేట్‌లో పిడుగుపాటుకు బర్రె మృతి చెందిం ది. గ్రామానికి చెందిన సట్టి నర్సయ్యకు చెందిన బర్రె పొలంలో ఓ చెట్టు కింద ఉండగా ఒక్కసారిగా పిడుగుపడడంతో బర్రె అక్కడికక్కడే మృతి చెందింది. బర్రె పాడిపై ఆధారపడి తమ కుటుంబాన్ని పోషించుకుంటుండగా బర్రె మృతితో జీవనాధారం కోల్పోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని కోరారు.

40 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

పట్టుబడిన లారీ, డ్రైవర్‌ను చూపిస్తున్న అధికారులు, ఎస్ఐ

సిర్గాపూర్, మే 20: గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని పోచాపూర్ చౌరస్తా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా లారీ నెంబర్ కేఏ 56 7022 అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశామన్నారు. లారీలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వారు వచ్చి లారీని తనిఖీ చేసి 40 టన్నుల పీడీఎస్ రైస్ ఉన్నట్లు గుర్తించి పంచనామా జరిపారని పేర్కొన్నారు. ఈ లారీ కర్ణాటకలోని గురుమిటికల్ నుంచి పిట్లం వైపు వెళ్తున్నట్లు చెప్పారు. సివిల్ సప్లయ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓనర్ జాకీర్‌మియా, డ్రైవర్ అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. డీఎస్పీ విజిలెన్స్ వెంకటేశ్, పోలీసులు ఉన్నారు.

భారీగా మెడికల్ ఘన వ్యర్థాల కాల్చివేత

చెక్క పెట్టెల్లో తెచ్చిన మెడికల్ ఘన వ్యర్థాల కాల్చివేతతో ఎగిసిపడుతున్న మంటలు

జిన్నారం, మే 20:జిన్నారం మండలం కొడకంచి శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున భారీ చెక్కపెట్టెల్లో పెద్ద ఎత్తున తీసుకువచ్చిన ఘన వ్యర్థాలను కాల్చివేయడంపై స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. డెక్కన్ ఆటో పరిశ్రమకు కూతవేటు దూరంలోనే ఘన వ్యర్థాలను కాల్చి వేయడంతో దట్టమైన మంటలు వ్యాపించాయని గ్రామస్తులు తెలిపారు. గాల్లోకి ఎగిసిన మంటలు, పొగలతో చుట్టుపక్కల చిమ్మచీకట్లు అలుముకున్నాయన్నారు. మెడికల్ వేస్టేజీకి సంబంధించి కాల్చివేతలు చేశారనే అనుమానం వ్యక్తం చేశారు. కాల్చివేతలు జరిపి, చెక్క పెట్టెలను అలాగే వదిలి వెళ్లిపోయారని ఆందోళన చెందారు. ప్రధాన రహదారికి చేరువలోని వ్యవసాయ క్షేత్రాల సమీపంలో కాల్చివేతలు చేయడంపై జీవాలు కాసే కాపర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణంతో పాటు ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా కాల్చివేతలు జరిపిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు

జిన్నారం, మే 20: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై గడ్డపోతారం మున్సిపల్ వాసులు ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం స్పందించిన రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్ ఆదేశాల మేరకు..ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ సర్వేనెంబర్ 27లోని తెలంగాణ కాలనీ, సర్వే నంబర్ 10లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. తెలంగాణ కాలనీలో బేస్మెంట్ లెవల్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని స్థానికులను ఆదేశించారు. అలాకాకుండా నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా ఊపేక్షించేది లేదని చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

న్యాల్‌కల్‌లోలో మాట్లాడుతున్న ఎంఈవో మారుతీరాథోడ్

జహీరాబాద్, మే 20: విద్యార్థుల ప్రగతి కోసం ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల విద్యాధికారులు బస్వారాజ్, మారుతీరాథోడ్, జాఫర్‌అల్లీ అన్నారు. మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయాల్లో ఉపాధ్యాయులకు నిర్వహించే వృత్యంతర శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పాఠశాల ప్రణాళిక, విద్య ప్ర